www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 ఏప్రిల్ 2023
5
వైఎస్ఆర్





పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

'చెత్తపన్ను'కు వ్యతిరేకంగా పోరాడుదాం : సిపిఎం

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప కార్పొరేషన్, జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలో ఈనెల నుంచి వసూలు చేయాలని నిర్ణయించిన చెత్త పన్నుకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ప్రజానీకం మీద వివిధ రకాల భారాలు వేయటానికి సన్నద్ధమవుతుందన్నారు. చెత్త పన్ను సక్రమంగా చెల్లింపులు జరగకపోతే ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయాలని చేసిన నిర్ణయం ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసేదిగా ఉందన్నారు. చెత్త పన్ను మీద పెద్ద ఎత్తున పోరాటం చేసిన ఫలితంగా కడప కార్పొరేషన్ పాలకవర్గం చెత్త పన్నును రూ.90 నుంచి రూ .40 తగ్గించాలని చేసిన తీర్మానం చేసిందన్నారు. స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. కడప, ప్రొద్దుటూరు పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో చెత్త పన్నును వసూలు చేయాలని ప్రభుత్వం ఆలోచించటం సరైందని కాదన్నారు. జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ప్రజానీకం మీద పడుతున్న భారాలను తక్షణమే నిలుపుదల చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ భారాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధమవుతామని చెప్పారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'అచ్చెన్న' దోషులను కఠినంగా శిక్షించాలి : అఖిలపక్షం

ప్రజాశక్తి-కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ అచ్చెన్న హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆందోళన కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ అచ్చెన్న హత్య సంఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేసును తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. మృతదేహానికి కుటుంబ సభ్యులు లేకుండా పంచనామా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దోషులకు శిక్ష పడేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈనెల 8న అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు చంద్ర, రామ మోహన్, సత్తార్, డాక్టర్ శ్రీనివాసులు, సుబ్బయ్య, మునయ్య, బాదుల్లా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి చిహ్నం రంజాన్ మాసం

కడప : మతసామరస్యానికి చిహ్నం పవిత్ర రంజాన్ మాసం అని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష అన్నారు. ఉప ముఖ్యమంత్రి అల్లుడు షేక్ ఉమైర్ మూడు రోజుల పర్యటన సందర్భంగా ఎపి ఎన్ఆర్‌టిఎస్ కో–ఆర్డినేటర్ సయ్యద్ అక్రం, ప్రముఖ వ్యాపారవేత్త షేక్ సమీవుల్లా ఆధ్వర్యంలో దుబాయ్ లో ఆదివారం రోజున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి దుబాయ్ వైసిపి కన్వీనర్ సోమిరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, షేక్ అబ్దుల్లా, ఫహీం, హారికృష్ణ, అబ్రార్. గఫార్, బ్రహ్మానందరెడ్డి, సయ్యద్ నాసర్, జాఫర్ అలీ, ఖాదర్ వలీ, ఉదయ్,శ్యామ్ రెడ్డి, రమణ సందీప్ మరియు భారీ ఎత్తున వైకాపా అభిమానులు పాల్గొన్నారు.

అపరాధ రుసుం నుంచి మినహాయింపు



కడప అర్బన్ : దేశంలో, రాష్ట్రంలో వ్యాపారులందరికీ అపరాధ రుసుంనుంచి మినహాయింపు ఇచ్చారని ఏపీ టాక్స్ ప్రాక్టీసినర్స్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ షఫీఖాన్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ జీఎస్టీ చట్టం వచ్చిన తర్వాత 2017-18 నుంచి వ్యాపారులకు రూ 2 కోట్లు టర్నోవర్ దాటిన వారు ప్రతి ఏడాది జీఎస్టీఆర్-9,9 సి రిటర్న్ సెప్టెంబర్ లోపల దాఖలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. చాలామంది దాఖలు చేయలేదని ఇప్పుడు ఫైల్ చేస్తే లక్షల్లో అపరాధ రుసుం వస్తుందని తెలిపారు. వ్యాపారస్తులు జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకుని తర్వాత ఆరు నెలల పాటు రిటర్న్స్ దాఖలు చేయకపోతే నోటీసు జారీ చేసి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారని పేర్కొన్నారు. స్వతహాగా రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసిన తరువాత మూడు నెలల లోపు జీఎస్టీఆర్ -10 ఫైల్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అలా చేయకపోతే లక్ష రూపాయలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. మూడు అంశాలపై గత ఏడాది డిసెంబర్ 19న ఢిల్లీలోని సిబిఐసి చైర్మన్ వివేక్ జోహార్ కి, కేంద్ర ఆర్థిక మంత్రికి, జీఎస్టీ కౌన్సిల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. తన కృషికి ఫలితం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప అర్బన్: జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వల్లూరు : మండల కేంద్రంలోని కడప–తాడిపత్రి జాతీయ రహదారి గణేష్‌పురం వద్ద పోలేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఎంఇఒ లిల్లెమ్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, బాటసారులు, వాహనదారుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వల్లూరు మాజీ ఉపసర్పంచ్ వంకదార ఆంజనేయులు, బాబు, రమేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంఇఒ లిల్లెమ్మ

మెగా డిఎస్‌సిని విడుదల చేయాలి

- ధర్నాలో డివైఎఫ్ఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నిక హామీల్లో ఇచ్చిన మెగా డిఎస్‌సిని వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. 25వేల ఉపాధ్యాయ పోస్టులకు డిఎస్‌సిని తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా డిఇఒ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే ఖాళీలన్నింటినీ కలిపి ప్రతి సంవత్సరమూ డిఎస్‌సి, గ్రూప్–2 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇప్పటివరకు నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. డిసెంబర్ 22వ తేదీ పార్లమెంటులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర డివైఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షులు ఎఎ రహీం రాజ్యసభ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆంధ్రప్రదేశ్‌లో 50,667 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారన్నారు. కానీ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని అడిగితే కేవలం 774 పోస్టులే ఖాళీగా ఉన్నట్లు నిరుద్యోగులను మోసం చేసే విధంగా కుట్రపూరితమైన సమాధానం చెప్పారని పేర్కొన్నారు. గతంలో జాబ్ క్యాలెండర్‌లో కానిస్టేబుల్, గ్రూప్–2 ఉద్యోగాల పైన కూడా ఇలాంటి ప్రకటనలే రాష్ట్ర ప్రభుత్వం చేసిందని తెలిపారు. ఇలాంటి అసంబద్ధ ప్రకటనలను మానేసి వాస్తవంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగాలకు తక్షణమే 25 వేల పోస్టులతో డిఎస్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ –2కు కూడా నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు నిరుద్యోగులను కలుపుకుని అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దిగవలసి వస్తుందని హెచ్చరించారు. అనంతరం డిఇఒ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి.రాజేంద్రప్రసాద్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, నాయకులు శివ, పవన్, శ్రీను, మహేష్ పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

హనుమత్ వాహనంపై కోదండరాముడు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట



ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై అభయమిచ్చారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కళాబృందాల కోలాటాలు ఆకట్టుకున్నాయి. శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా ఉదయం నవనీత కష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తు ఒడగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. యాత్రికులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు వేడుకగా అభిషేకం చేశారు. సాయంత్రం 5.00 గంటల నుండి 6.00 గంటల వరకు ఊంజల్‌సేవ వైభ వంగా నిర్వహించారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామివారు యాత్రికులకు దర్శనమిచ్చారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగ ణంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు భక్తిభావాన్ని పంచాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎఇఒ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్ర హ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

లాభాల బాటలో డిసిసి బ్యాంక్ : చైర్‌పర్సన్

కడప అర్బన్ : డిసిసి బ్యాంక్ 35 ఏళ్ల తరువాత లాభాల బాటలో ముందుకు వెళుతుందని చైర్ పర్సన్ ఝాన్సీ పేర్కొన్నారు. సోమవారం డిసిసి బ్యాంక్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, నాబార్డ్ సహకారం, ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు సిబ్బంది రైతులు స్వయం సహాయక గ్రూపుల తోడ్పడుతూ లాభాల్లోకి వెళుతున్నామని చెప్పారు. ాదుపు మొత్తం పై అధిక వడ్డీని అందజేస్తున్నామని తెలిపారు. డిపాజిట్ చేసిన వారికి రూ. 5 లక్షల బీమా వర్తింపజేస్తున్నామన్నారు. ఆర్‌బిఐ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తున్నామని చెప్పారు.రూ. 2,500 కోట్లకు పైగా వ్యాపారం చేస్తున్నామని, రూ.3,500 కోట్లు రుణాలు ఇవ్వగలిగామని తెలిపారు. రూ.395 కోట్లు రైతులకు రుణాలు ఇచ్చామని చెప్పారు. అరటి నారుతో వ్యాపార అభివృద్ధికి సహకారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. రుణాల రికవరీపై అధిక శ్రద్ధ పెట్టామన్నారు. 72 సొసైటీలలో 9 సొసైటీలు లాభాల బాటలో ఉన్నాయని చెప్పారు. మరో 5,6 బ్రాంచ్ల ఏర్పాటుకు వినతిపత్రం అందించామని తెలిపారు. ఆప్కాబ్ ద్వారా రూ.200 కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. 13వ స్థానం నుంచి రెండవ స్థానానికి వచ్చామన్నారు. సమావేశంలో సీఈవో రాజేంద్ర కుమార్, డైరెక్టర్లు వెంకటసుబ్బారెడ్డి, నుంచి హుస్సేన్ పీర, ప్రొఫెషనల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఆడిట్ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

కడప : వేసవికాలంలో పిల్లల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూ చించారు. సోమవారం ఆమె ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సంద ర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సద స్సులు నిర్వహి ంచారు. వసతి గృహాలలో పిల్లలకు అందు తున్న వసతి సదు పా యాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట ర్లను పరిశీలించారు. వంటశాలను, వసతి గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సూపరింటెండెంట్, వైద్యాధికారి, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు ఉచితంగా ఇవ్వాలి

ప్రజాశక్తి-బద్వేలు

పట్టణంలోని సుందరయ్య కాలనీలో 50 కుటుంబాల వారికి విద్యుత్ మీటర్లు లేవని, ఉచితంగా ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చాంద్‌బాష పేర్కొన్నారు. సోమవారం విద్యుత్ కార్యాలయంలో ఎఇ చిన్నయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుందరయ్య కాలనీ ఏర్పడి 22 ఏళ్లవుతోందని, 15 వందల కుటుంబాలు నివాసమున్నారని చెప్పారు. వీరిలో కొంత మందికి విద్యుత్ మీటర్లు లేవని, ఆరేళ్ళుగా బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ బిగించలేదని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రమణయ్య , నాయకులు గౌస్ బాషా, బాలస్వామి, ఖాదర్ బాషా కైరున్ , ఫాతిమా, పెంచలమ్మ , మాధవి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం : సిఐటియు

ప్రజాశక్తి-బద్వేలు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని, ఈనెల 5న నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శులు కె. శ్రీనివాసులు, కె. నాగేంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర అమలు చేయాలని , నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం ఆపాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ద్వారా భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు అదనంగా పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇరుపోతు ఓబులేసు, బద్వేల్ రూరల్ నాయకులు పాల్గొన్నారు.

భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మండలం చెన్నంపల్లె పొలం సర్వే నంబరు 1580/బిలో 3.64 ఎకరాల భూమిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ గోపయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్ స్పందన్‌లో డిఆర్ఒ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో అంబేద్కర్ లెదర్ ఆర్టిజన్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చర్మకారుల సొసైటీ ద్వారా మాదిగలకు కేటాయించారని తెలిపారు. లెదర్ పార్క్ ఏర్పాటు చేయకపోవడంతో భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాసాపేట శివ, గుర్రప్ప, బీఎస్పీ జిల్లా ఇన్చార్జి గుర్రప్ప, నాయకులు పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతి పత్రం అందజేస్తున్న గోపయ్య

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సెంటర్ల వద్దకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతి లేదు అని అధికారులు చెప్పడంతో విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విద్యాశాఖ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. ప్రతి సెంటర్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు నిషేధించారు. మొదటిరోజు పరీక్షలకు 27,354 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 27,179 మంది విద్యార్థులు హాజరయ్యారు. 175 మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 57 కేంద్రాలు, డిఇఒ 5 కేంద్రాలు, పరీక్ష పరిశీలకులు 9 కేంద్రాలను తనిఖీ చేశారు. డిబార్ నమోదు కాలేదు. చెన్నూరు : స్థానిక జడ్పీ బాలికలు బాలికల ఉన్నత పాఠశాలలో 188, ఆర్ఆర్ పాఠశాలలో 161 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు బల్లలు, తాగునీటి సౌకర్యము, ఇతర మౌలిక వసతులు కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశ్నపత్రం లీకేజీ అవాస్తవం : ఆర్‌జెడి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి

కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని పదవ తరగతి తొలి పరీక్ష తెలుగు ప్రశ్నపత్రం లీకేజీ వాస్తవం కాదని అన్నమయ్య, కడప జిల్లాల పరీక్ష పరిశీలన అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమవారం జరిగిన తెలుగు పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ అయినట్లు జరిగిన ప్రచారంలో వాస్తం లేదని తెలిపారు. ప్రశ్నపత్రంలోని కొన్ని సమాధానాలు మాత్రం జిరాక్స్ సెంటర్ వద్ద లభ్యమయ్యాయన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. జిరాక్స్ సెంటర్ యాజమాని, ఆన్సర్ సీటు తెచ్చిన వ్యక్తిని విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందకుండా జరగబోయే పరీక్షలను ప్రశాంతంగా రాయాలన్నారు. జరగబోయే పరీక్షలను కట్టుదిట్టంగా ఇటువంటి వాటికీ తావు లేకుండా చూస్తామన్నారు. సమావేశంలో డిఇఒ రాఘవరెడ్డి, డిప్యూటీ డిఇఒ రాజగోపాల్‌రెడ్డి, మైదుకూరు రూరల్ సిఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ విద్యాసాగర్, మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్: బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిరాక్స్ సెంటర్‌లో పదవతరగతి ప్రశ్నపత్రం దర్శనమివ్వడం దారుణమన్నారు. పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నపత్రం ఎలా బయటకి వచ్చిందో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఎం సొంత జిల్లాలోనే ప్రశ్నపత్రం లీకేజీ అయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంలో విఫలమైన జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్, సురేష్ పాల్గొన్నారు.

నేడు గ్రూప్-4 పరీక్షలు : డిఆర్ఒ

కడప : ఎపిపిఎస్‌సి గ్రూప్–4 పరీక్షలు ఈనెల 4న నిర్వహించనున్నామని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎపిపిఎస్‌సి గ్రూప్ – 4 కంప్యూటర్ ఆధారిత ఎపి రెవెన్యూ శాఖకు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ పోస్ట్ మెయిన్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు జిల్లాలో రెండు పూటల నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే హాజరు కావాలన్నారు. జిల్లాలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ సి.హెచ్. సాయి ప్రకాష్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎన్. శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు : ఎస్‌పి

కడప అర్బన్ : జిల్లాలో గన్ లైసెన్సులపై అవాస్తవాలు, అసత్య ప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌పి అన్బురాజన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014 నుంచి 2019 సంవత్సరం వరకూ జిల్లాలో 117, 2019 నుంచి 2023 వరకూ 159 లైసెన్సులు మంజూరు చేశామని తెలిపారు. ఇందులో 70 శాతం లైసెన్సులు ఎటిఎంలలోక్యాష్ లోడింగ్‌కు, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ, బ్యాంకుల భద్రతలో భాగంగా ట్రైన్డ్ సెక్యూరిటీ గార్డ్సకు ఇచ్చినవేనని పేర్కొన్నారు. పదేళ్లలో మొత్తం 276 లైసెన్సులు మంజూరు చేశామని తెలిపారు. అవాస్తవాలు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటన జయప్రదం చేయాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో పర్యటన ఏర్పాట్లపై నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన జోన్– 5 సమావేశానికి ఈ నెల 6న చంద్రబాబు నాయుడు జిల్లాకు వస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తారని చెప్పారు. సమావేశంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు అందించడమే లక్ష్యం

కలసపాడు : మండలంలోని ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే తమ లక్ష్యమని జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, ఎంపిపి నారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన సచివాలయ బూతు కన్వీనర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు ప్రజల వద్దకు సంక్షేమ పథకాలను తీసుకెళ్తూ వారి ఆధారాభిమానాలను పొందుతుందని చెప్పారు. ప్రతినెలా అజెండా ప్రకారం ప్రజల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, సుధా, రామకృష్ణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సగిలి, సుదర్శన్, సచివాలయాల బూత్ కన్వీనర్ల కో–ఆర్డినేటర్ చిత్తా, రాజశేఖర్ రెడ్డి, ఎంపిటిసి షరీఫ్, రమణారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జి.వి.రాఘవరెడ్డి

- ప్రధాన కార్యదర్శిగా వై.టి.జాన్సన్ కెనడీ
- ఉపాధ్యక్షులుగా పి.ఎస్.బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - కడప

కడప బార్ అసోసియేషన్‌కు సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది జి.వి. రాఘవరెడ్డి 203 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. 629 ఓట్లకు గాను 557 ఓట్లు పోలయ్యాయి. ఇందులో నాలుగు ఓట్లు చెల్లలేదు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన జి.వి. రాఘవరెడ్డికి 378 ఓట్లు పోలయ్యాయి. బి గుర్రప్ప నాయుడుకు 175 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన వై. టి. జాన్సన్ కెనడీ 202 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. వై.టి. జాన్సన్ కెనడీకి 379 ఓట్లు పోలయ్యాయి. చంద్ర వదనకు 177 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షులుగా పి.ఎస్. బాలసుబ్రమణ్యం 43 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధిం చారు. ఆయనకు 256 ఓట్లు పోల్ అయ్యాయి. ఏ. ఉమాదేవికి 213 ఓట్లు, పి. చంద్రమోహన్‌కు 88 ఓట్లు వచ్చాయి. కడప బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఎన్నికల అధికారి కె నిరంజన్ కుమార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి వెంకటేశ్వర్ రెడ్డి పత్రాలను అందజేశారు. విజయం సాధించిన ముగ్గురికి సీనియర్, జూనియర్ న్యాయ వాదులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వీట్లు పంచిపెట్టారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ విభాగానికి పి. చిన్నారెడ్డి, కోశాధి కారిగా కె భువన ఏకాదశి రెడ్డి, లైబ్రరీ సెక్రెటరీగా జె. విజయ్ కుమార్ ఏకగ్రీ వంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.




నియామక పత్రాలు అందుకుని, సంబరాలు చేసుకుంటున్న అసోసియేషన్ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

సిపాయిల పట్ల వివక్ష తగదు

కడప అర్బన్ : వన్ రాంక్ వన్ పెన్షన్ –2లో మాజీ సైనికులు చేస్తున్న నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మినారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర నిరసనలు తెలుపుతున్నా సైనిక అధికారుల మాటలు మాత్రమే వింటూ సిపాయిలను చిన్న చూపు చూడటం విచారకరమన్నారు. వెంటనే మాజీ సైనికుల సమస్యలపై విచారించి పరిష్కరించాలని తెలిపారు.

ముగిసిన అంకాలమ్మ తిరుణాల

వల్లూరు : మండల కేంద్రంలో అంకాలమ్మ తిరణాల సోమవారం వైభవంగా ముగిసింది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు మండల వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు స్థానిక పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో భద్రత కల్పించారు.దాతలు భక్తులకు అన్నదానం, మజ్జిగ తాగు నీటిని అందించారు.



వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట వాసవి క్లబ్ అధ్యక్షులు ఆర్గద్ద వీరయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కూల్ వాటర్ చలివేంద్రాన్ని ఎస్‌వి కుల్లాయప్ప ప్రారంభించారు. జోన్ చైర్ పర్సన్ తాత వెంకట సుబ్రహ్మణ్యం, సరస్వతి వడకం చైర్మన్ లక్ష్మికుమార్, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, క్లబ్ సెక్రటరీ కృష్ణమోహన్, ట్రెజరర్ లక్ష్మీనారాయణ, సభ్యులు సుబ్బరాయుడు, వీరరాఘవులు, చిన్న వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. అనంతరం ఎస్‌వి కుల్లాయప్పను వాసవి క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.


ఎస్‌వి కుల్లాయప్పను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పూల రియాజ్ అహ్మద్‌ను పరామర్శించిన 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని సర్వర్‌ఖాన్‌పేటకు చెందిన ఆదర్శ పాఠశాల మాజీ చైర్మన్ పూల రియాజ్‌అహ్మద్‌ను కడప రిమ్స్‌లో సోమవారం టిడిపి మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పరామర్శించారు. రియాజ్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి రిమ్స్ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి రిమ్స్‌కెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్య సిబ్బందికి పుట్టా సూచించారు. **ముక్తియార్ పరామర్శ :** టిడిపి జిల్లా మైనారిటీ సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్ ఇటీవల గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. సోమవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వివిఎస్ ముక్తియార్ సర్వర్‌ఖాన్‌పేటలోని గౌస్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఎలాంటి ఆందోళన చెందకుండా మంచి ఆహారం, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.


రియాజ్‌ను పరామర్శిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

పేదవాడి రాజ్యం రావాలి : టిడిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో దోపిడి రాజ్యం పోవాలి.. పేదవాడి రాజ్యం రావాలని ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గోపవరం పంచాయతీలో సోమవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులతో కలిసి ప్రవీణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో గిద్దలూరు సుబ్రహ్మణ్యం ఆచారి, మార్తల వీర ప్రతాపరెడ్డి, 14వ వార్డు మార్తల సుబ్బారెడ్డి,కృష్ణారెడ్డి, ఉండేల ఓబుల్‌రెడ్డి, ప్రొద్దుటూరు రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల రెడ్డి, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, తమ్మిశెట్టి సురేంద్ర, టిఎన్‌టియుసి తమ్మిశెట్టి శ్రీనివాసులు, బండి ఆనంద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


స్కూటర్‌ను ఢీకొన్న ఆర్‌టిసి అద్దె బస్సు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో సోమ వారం స్కూటరిస్ట్‌ను ఆర్‌టిసి అద్దె బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెం దాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. సిద్ధవటం మండలం జ్యోతి గ్రామానికి చెందిన గొల్లపల్లె పెద్ద ఓబయ్య (59) తమ కుటుం బాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను అప్పనపల్లి వసతి గృహంలో వదిలి పెట్టేం దుకు వెళుతుండగా.. ప్రొద్దుటూరు నుంచి కడపకు వెళుతున్న ఆర్‌టిసి అద్దె బస్సు ఢీకొంది. పెద్ద ఓబయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు విద్యార్థులు స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీరామనవమి పండగ పురస్కరించుకుని సెలవులు ముగించుకొని విద్యార్థులను హాస్టల్‌లో వదిలేందుకు పోతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

ఖాజీపేట మండలంలోని నందిపాడు కాలనీ సమీపంలో ఇంజనీర్ కొట్టాలు గ్రామం వద్ద సోమవారం సాయంత్రం కల్వర్టును కారు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మైదుకూరు నుంచి కడపకు వెళు తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి కల్యాణ్‌రెడ్డి (35)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు కడప చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు. సంఘటన ప్రాంతాన్ని సందర్శించి పోలీసులు విచారిస్తున్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని సోలార్ ఫ్యాక్టరీ సమీపంలో వనం నారాయణస్వామి (52)అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు.. నారాయణస్వామి అనే వ్యక్తి సోమవారం ఉదయం సోలార్ ఫ్యాక్టరీలో పని కోసం వెళ్లి తిరిగి వస్తుండగా, అక్కడి నుంచి వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ తగలడంతో కిందపడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. నారాయణస్వామి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

మాట తప్పిన సిఎం జగన్ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మద్యపాన నిషేధంపై ముఖ్యమంత్రి జగన్ మాట తప్పి, మడమ తిప్పారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాపురాల్లో మద్యం చిచ్చు పెట్టడంతో మానవ సంబంధాలు తెగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దశల్లో మద్యాన్ని నిషే ధించడంతోపాటు ఫైవ్ స్టార్ హోటల్లో పరిమితం చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పారని గుర్తు చేశారు. మద్యంపై ఆదాయం అంటే ప్రజల రక్త మాంసాలతో వ్యాపారం చేయడమేనని తెలిపారు. ప్రజా సంకల్ప పాదయాత్ర సందర్భంగా 2017 నవంబర్ 18న కర్నూలు జిల్లా దొర్నిపాడులో జగన్ చెప్పిన మాటలను తులసిరెడ్డి గుర్తు చేశారు. ప్రస్తుతం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ మద్యంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తోందని విమర్శించారు. జగన్ పాలనలో దశల వారీగా మద్యం వినియోగం, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెరిగిందన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత పథకాల ద్వారా ప్రభుత్వం కుటుంబాలకు చేసే ఆర్థికసాయం కంటే నాన్న బుడ్డికి చాలడం లేదని వివరించారు. జగన్ ప్రభుత్వానికి మహిళా సాధికారత, మేనిఫెస్టో పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఇంటే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

పోషకాహారం తప్పక తీసుకోవాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపిపి టి.లక్షుమయ్య, సిడిపిఒ సావిత్రమ్మ సూచించారు. పోషణ్ పక్వాడ పక్షోత్సవాల సందర్భంగా పల్లవోలు సచివాలయంలో సోమవారం బాలింతలకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీల ద్వారా 3 సంవత్సరాలలోపు పిల్లల పెరుగుదలకు బాలామృతం అందిస్తున్నామన్నారు. ఇందులో అన్ని రకాల పోషక పదార్థాలున్నాయన్నారు. చాలామంది గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్నారని, తద్వారా రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. ఆకుకూరలు, పోషక పదార్థాలున్న పప్పు దినుసులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రతినెల హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్ష చేయించుకొని, అందుకు అనుగుణంగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పోషక విలువలు ఉన్న పదార్థాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఆయాలకు సన్మానం

మండల పరిధిలోని సోమాపురం, పల్లవోలు అంగనవాడీ కేంద్రాల్లో ఆయాలుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వై.వెంకటమ్మ, డి.కొండమ్మను సోమవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. పల్లవోలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ 20ఏళ్లపాటు అంగన్వాడీ కేంద్రాల్లో తమ సేవలను వినియోగించి, ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందడం బాధాకరమన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల పట్ల ప్రేమతో వీరు వ్యవహరించిన తీరు అభినందనియమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, అంగన్వాడీ సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్తమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆయాలను సన్మానిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ, ఐసిడిఎస్ సిబ్బంది

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - వేంపల్లె

సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. మండలం వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు 1,046 మంది ఉండగా వేంపల్లెలో నాలుగు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్షలకు 3 విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఒ వీరారెడ్డి తెలిపారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పోలీసులు ఆయా సెంటర్ల వద్ద బందోబస్తు నిర్వహించారు. సిఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్ఐ తిరుపాల్ నాయక్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకున్నారు. **చాపాడు :** పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. మండలంలోని 359 మంది విద్యార్థులకుగానూ అందరూ హాజరయ్యారని తెలిపారు. మండల పరిధిలో లక్ష్మిపేటలో ఒకటి, చాపాడులో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పరీక్ష కేంద్రాల వద్ద ఇతరులెవరూ లేకుండా సిఐ నరేంద్రరెడ్డి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. **ముద్దనూరు :** మండల కేంద్రంలోని బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలకు చెందిన 307 మంది విద్యార్థులకుగానూ ఒకరు గైర్హాజరైనట్లు ఎంఇఒ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో తెలుగు పరీక్షకు 154 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 153 మందికి గానూ ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. **పులివెందుల రూరల్ :** మండల పరిధిలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా వీరికోసం ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ వీరారెడ్డి తెలిపారు. మొదటి పరీక్షల్లో 1,667 మంది విద్యార్థులకుగాను, 16 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. **ఎర్రగుంట్ల :** మండల పరిధిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను సోమవారం ప్రారంభించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. మండల వ్యాప్తంగా 850 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 846 మంది పరీక్ష రాసినట్లు ఎంఇఒ సుబ్బారావు తెలిపారు. **కొండాపురం :** రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు మొదటిరోజు కొండాపురం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. కొండాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ సెంటర్‌లో పూర్తిస్థాయిలో 180 మంది హాజరుకాగా, శివసాయి హై స్కూల్‌లో 150 మందికిగానూ 149 మంది, అక్షర హైస్కూల్లో 128 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 127 మంది హాజరైనట్లు ఎంఇఒ ఓబులేసు తెలిపారు. **లింగాల :** 10వ తరగతి పరీక్షలకు మొదటిరోజు సోమవారం 211 విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని లింగాల, కోమన్నూతల, పార్నపల్లి, వెలిగండ్ల, బోనాల, పెద్దకుడాలా పాఠశాలల నుంచి 212 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు.

అటవీ శాఖ అనుమతివ్వాలని ఎంపీ వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లాలోని కాశిరెడ్డినాయన మండలం జ్యోతి క్షేత్రంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం అభివృద్ధికి అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన ఢిల్లీలోని నేషనల్ బోర్డ్ వైల్డ్ లైఫ్ స్టాండింగ్ కమిటీ మెంబర్ సెక్రటరీ సత్య ప్రకాష్ యాదవ్‌ను కలిశారు. అటవీశాఖ అనుమతి విషయమై చర్చించి వినతిపత్రం అందజేశారు. దీనిపై గతంలో ఎపి ప్రిన్సిపాల్ సెక్రటరీ ద్వారా అటవీశాఖకు ఈ ఏడాది మార్చి 20న పంపిన లేఖను వినతిపత్రానికి జత చేసినట్లు ఎంపీ వివరించారు. అటవీశాఖ అనుమతుల ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీలో పెట్టి వీలైనంత త్వరలో ఆమోదం తెలపాలని ఎంపీ ఈ సందర్భంగా సత్యప్రకాశ్ యాదవ్‌ను కోరారు.


సత్యప్రకాష్‌తో మాట్లాడుతున్న ఎంపీ

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం పీఆర్ అధికారులతో ఆయన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వివిధ గ్రామాలకు అనుసంధానం చేసే బిటి రోడ్ల పనుల ప్రగతిపై పీఆర్ ఇఇ ఓబుళరెడ్డి సమక్షంలో ఆ శాఖ అధికారులతో చర్చించారు. వివిధ మండలాల్లో కొనసాగుతున్న పనులు, ప్రారంభించాల్సినవి, పనులు పురోగతిలో ఉన్నవి, పూర్తయిన పనుల వివరాలను ఒఎస్‌డికి వివరించారు. సమీక్షలో పీఆర్ డిఇలు సుధాకర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, రామప్రసాద్‌రెడ్డి, ఎఇలు పాల్గొన్నారు.

వాలంటీర్‌కు నియామక పత్రం అందజేత

ముద్దనూరు : ముద్దనూరు గ్రామ వాలంటీరుగా విష్ణుప్రియకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణారెడ్డి, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచు వీరాంజనేయరెడ్డి పాల్గొన్నారు.


సరైన చికిత్సతో క్షయ నయం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : క్షయ వ్యాధిని సరైన సమయంలో గుర్తించి, మందులు వాడితే నయమవుతుందని జిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగేంద్ర తెలిపారు. క్షయ వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాలులో కల్లూరు, కామనూరు, రాజుపాళెం పిహెచ్‌సిల సిహెచ్‌ఒలకు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తితో సాన్నిహిత్యం ఉండరాదన్నారు. సూపర్ వైజర్ వరప్రసాద్, ప్రొద్దుటూరు క్షయ నివారణ యూనిట్ సూపర్‌వైజర్ మాధవరెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధి రోగులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆయా విషయాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో క్షయ నివారణ సిబ్బంది హుసేన్ బాషా, మున్నా, గురుప్రసాద్ పాల్గొన్నారు.

'సజ్జల'ను కలిసిన పలువురు వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో సోమవారం ఎపి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని పలువురు వైసిపి నాయకులు కలిశారు. ఇటీవల రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి మరణించిన విషయం విదితమే. శ్రీనాథ్‌రెడ్డి స్వగ్రామమైన సింహాద్రిపురం మండలం కోరు కుంటపల్లె గ్రామానికి ఆయన చేరుకొని అక్కడ జరిగిన పెద్దకర్మలో కార్య క్రమంలో సజ్జల పాల్గొన్నారు. అనంతరం ఆయన పులివెందుల ఆర్అండ్‌బి అతిథిగృహం చేరుకున్నారు. వైసిపి పులి వెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, పులివెందుల పురపాలక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆయనతో మాట్లాడారు. పురపాలక చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి' కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ సజ్జలను సత్కరించారు.


సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నేతలు

వంద శాతం ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఇకెవైసి వంద శాతం పూర్తి చేయాలని వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. మండ లంలోని తిమ్మా పురం, పెనికలపాడు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను, డిజిటల్ కియోస్క్ మిషన్ పరి శీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ పెండింగులో ఉన్న ఇకెవైసి వంద శాతం పూర్తి చేయాలన్నారు. రైతులు ఎవరైనా మరణిస్తే ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించి, పిఎం కిసాన్ పోర్టల్ మరణం జాబితాలో నమోదు చేయాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు గ్రామాల వారీగా రైతులు పంటలు సాగు చేసే విస్తీర్ణం బట్టి కావాల్సిన క్రిమిసంహారక మందులు పరిమాణాన్ని నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు.

జనసేన సైనికులుగా మారుదాం

- నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జి అల్లం సూర్యనారాయణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలోని పవన్‌కల్యాణ్ అభిమానులు జనసేనకు సైనికులుగా మారే అవకాశం వచ్చిందని ఆ పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లం సూర్యనారాయణ తెలిపారు. స్థానిక సంజాముల మోటు వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ జనసేన ఆత్మబంధు యాత్ర స్ఫూర్తితో జమ్మలమడుగు నియోజకవర్గంలో తనతోపాటు నల్లంశెట్టి నాగార్జున, వనం గురుకుమార్, మురహరి గ్రామగ్రామాన జనసేన కార్యక్రమం నిర్వహించామన్నారు. తాళ్ళప్రొద్దుటూరు గ్రామంలో జనసేన పార్టీ ఆవశ్యకతను వివరించి, ప్రజల మద్దతు కోరామన్నారు. వైసిపి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, ధరలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక అవకాశం జనసేన పార్టీకి ఇస్తే రాష్ట్రాన్ని సస్యశ్యామలం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి అల్లం సూర్య నారాయణ సమక్షంలో జనసేన అభిమాన యువకులు వినోద్‌రాక్, మల్లేష్, గౌస్‌పీర్, నరేష్, సుబ్బరాయుడు, వెంకటసాయి, రామ్‌కృష్ణ, చిన్నరాజు, మనోజ్, నరసింహతోపాటు 70 మంది పార్టీలో చేరారు.

వ్యవసాయ భూమి కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని దళితులకు వ్యవసాయ భూమి కేటాయించి ఆదుకోవాలని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గున్నంపాటి వెంకటరమణ కోరారు. ఆ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రమణారెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులంతా ఎక్కువగా వ్యవసాయ కూలీలుగా ఉన్నారని, అలాంటి వారికి ప్రభుత్వం భూమిని కేటాయించి ఆదుకోవాలన్నారు. మండలంలో దాదాపు 120 మంది నిరుపేద దళిత కుటుంబాలు ఉన్నా యన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దళితులకు భూములు కేటా యించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శేఖర్, ఓబయ్య, నారాయణ, మహేష్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.